మళ్ళీ మనదే అధికారం

● డీఎంకే శ్రేణులకు స్టాలిన్ లేఖ



ప్యారీస్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రజల అండదండలతో రాష్ట్రంలో డీఎంకే ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వస్తుందని ముఖ్యమంత్రి స్టాలిన్ పార్టీ శ్రేణులకు రాసిన లేఖలో పేర్కొన్నారు. ఈ నెల 28,29 తేదీల్లో విల్లుపురం జిల్లాలో పర్యటించనున్న సీఎం స్టాలిన్, వివిధ ప్రభుత్వ కార్యక్రమాలతో పాటు డీఎంకే జిల్లా కార్యదర్శులు, పార్టీ అనుబంధ శాఖల నిర్వాహకులతో సమావేశం కానున్నారు. ఆ రెండు రోజుల పర్యటన విజయవంతం చేసేందుకు పార్టీ కార్యకర్తలు ఆయా ప్రాంతాల్లో ఏర్పాట్లు చేయాలని, ముఖ్యమంత్రికి ఘనస్వాగతం పలకాలని పార్టీ అధిష్ఠానం ఇటీవల సూచించింది. ఈ నేపథ్యంలో, జిల్లాల వారీగా తాను పర్యటించి ప్రభుత్వ పథకాల అమలు, చేపట్టిన పనులు పరిశీలించనున్నట్లు నామక్కల్‌లో సీఎం స్టాలిన్ ప్రకటించారు. ఆ మేరకు కోవై, విరుదునగర్ జిల్లాల్లో పర్యటన ముగించుకొని, ఈ నెల 14,15 తేదీల్లో అరియలూరు, పెరంబలూరు జిల్లాలకు సీఎం వెళ్లారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి కలైంజర్ కరుణానిధి శతజయంతిని పురస్కరించుకొని అన్ని జిల్లాల్లో కరుణానిధి విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమం జరుగుతోంది. రాష్ట్రంలో ఇక ఎప్పటికీ ద్రావిడ మోడల్ ప్రభుత్వమే ఏర్పాటవుతుందని, 2026 అసెంబ్లీ ఎన్నికల్లో 234 నియోజకవర్గాల్లో 200 స్థానాలకు పైగా డీఎంకేను గెలిపించాలన్న నినాదంతో స్టాలిన్ రాష్ట్ర పర్యటన సాగుతోంది. ఇదిలా ఉండగా, ఈ నెల 28,29 తేదీల్లో స్టాలిన్ పర్యటన సందర్భంగా విల్లుపురం జిల్లాలో ఏఏ ప్రాంతాల్లో వేదిక ఏర్పాటుచేయాలి, పార్టీ కార్యకర్తలతో సమావేశం కానున్న ప్రాంతాలను జిల్లా పోలీసు అధికారులు ఆదివారం పరిశీలించారు.

కోవై, కున్నూరుల్లో వర్షబీభత్సం

చెట్లు కూలి స్తంభించిన ట్రాఫిక్


కున్నూరులో ఇంటి ప్రహరీ కూలడంతో పడిన చెట్లు

చెన్నై, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): నీలగిరి జిల్లాల్లో ఈశాన్య రుతుపవనాల ప్రభావం కారణంగా వారం రోజులుగా చెదురుమదురుగా వర్షాలు కురిశాయి. కున్నూరు, పరిసర ప్రాంతాల్లో తరచూ వర్షాలు కురుస్తున్నాయి. కున్నూరు ప్రాంతమంతా ఆకాశం మేఘావృతమై చిరుజల్లులు పడుతూ చలిగాలులు వీస్తుండటంతో స్థానికులు చలికి వణికిపోతున్నారు. ఈ నేపథ్యంలో కున్నూరు, అరువంగాడు, వెలింగ్టన్, కాట్టేరి, పర్లియార్, కరుంపాలం, చిన్నవండిసోలై, కేత్తి, వండిసోలై, ఎడపళ్లి, కొలక్కంబై తదితర ప్రాంతాల్లో శనివారం ఉదయం సాయంత్రం వరకూ ఓ మోస్తరుగా కురిసిన వర్షాలు సాయంత్రం తర్వాత ఊపందుకున్నాయి. కుంభవృష్టిగా వర్షం కురవటంతో పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. కున్నూరు లైబ్రరీ భవనం వద్ద మట్టిచరియలు విరిగి పడటంతో విద్యుత్‌స్తంభం నేలకొరిగింది. మట్టిపెళ్ళలు వాననీటిలో కరిగి బస్‌స్టేషన్‌వైపు కొట్టుకుపోవటంతో ఆ ప్రాంతమంతటా బురదమయం కావటంతో ప్రయాణికులు, స్థానికులు ఇబ్బందులకు గురయ్యారు. ఇదే విధంగా కున్నూరు మార్కెట్ ప్రాంతంలోనూ వరద దృశ్యాలే కనిపించాయి. ఓట్టుపాట్టై ముత్తాలమ్మన్ ఆలయ వీధిలోని ఓ ఇంటి ప్రహరీ గోడ, గాంధీపురంలో ఇంటి ప్రహరీగోడ కూలిపడ్డాయి.


కురుంబాడి వద్ద కూలిన చెట్టును తొలగిస్తున్న కార్మికులు

శనివారం అర్ధరాత్రి వరకూ వర్షాలు పడడంతో కున్నూరు - మేట్టుపాళయం ఘాట్‌రోడ్డులో కురుంబాడి అనే చోట ఓ చెట్టు కూలి వాహనాల రాకపోకలు స్తంభించాయి. అగ్నిమాపక సిబ్బంది, కార్మికులు కూలిన చెట్టును ముక్కలు చేసి తొలగించారు. ఇక కోయంబత్తూరు సమీపంలోని వడవెళ్లి పరిసర ప్రాంతాల్లోనూ శనివారం సాయంత్రం నుండి రాత్రి పది గంటల వరకు ఓ మోస్తరు వర్షం కురిసింది. దీంతో ఎస్కేటీ నగర్ మెయిన్‌రోడ్డులో ఉన్న ఓ పెద్ద చెట్టు పక్కనే ఉన్న విద్యుత్‌స్తంభంపై పడి చెట్టుకింద పార్కింగ్ చేసిన బైకు ధ్వంసమైంది.

23న బంగాళాఖాతంలో అల్పపీడనం

చెన్నై, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఈ నెల 23న అల్పపీడనం ఏర్పడనుందని వాతావరణ కేంద్రం అధికారులు ప్రకటించారు. వెదర్‌మాన్ హేమచందర్ కూడా అల్ప పీడనం బలపడే అవకాశం కూడా ఉందన్నారు. రాష్ట్రమంతా సముద్రతీర ప్రాంతాల్లో కొన్ని చోట్ల ఓ మోస్తరుగా, మరికొన్ని చోట్ల కుండపోతగా వర్షాలు కురిపిస్తున్న ఈశాన్య రుతుపవనాలు ప్రస్తుతం తీవ్ర రూపం దాల్చి చెన్నై, తిరువళ్లూరు, చెంగల్పట్టు, కాంచీపురం తదితర జిల్లాల్లో ఆశించినంతమేర వర్షాలు కురవటం లేదు. ఈ నెల 20 తర్వాత బంగాళాఖాతంలో అలల ఉధృతి పెరిగే అవకాశాలున్నాయి. ఆ తర్వాత డిసెంబర్ ఆఖరువరకు భారీగా వర్షాలు కురుస్తుందని చెబుతున్నారు. ఈ నెల 25 తర్వాతే రాష్ట్రంలో ఈశాన్య రుతుపవనాలు తీవ్రరూపం దాల్చనున్నాయని చెప్పారు. ప్రస్తుతం ఉపరితల ఆవర్తనం, సముద్రతీర ప్రాంతాల్లో వీస్తున్న పెనుగాలుల కారణంగా సోమవారం కడలూరు జిల్లాలో, మంగళవారం డెల్టా జిల్లాల్లో ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని తెలిపారు. ఈ నెల 23న ఏర్పడే అల్పపీడనం తుఫానుగా మారిన తర్వాతే రాష్ట్రంలో ఈశాన్య రుతుపవనాలు తీవ్ర రూపం దాల్చనున్నాయని తెలిపారు.

సోదాలు పెరిగితే బీజేపీలో అన్నాడీఎంకే విలీనమే!

● ఈపీఎస్‌పై ఉదయనిధి ఎద్దేవా


డీఎంకే ఆధ్వర్యంలో జరిగిన సామూహిక వివాహ కార్యక్రమంలో వధూవరులకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి

చెన్నై, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఈడీ, ఐటీ తనిఖీలు పెరిగితే బీజేపీలో అన్నాడీఎంకేను విలీనం చేసేందుకు ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) సిద్ధంగా ఉన్నారని ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి యెద్దేవా చేశారు. తిరువొత్తియూరులోని కల్యాణమండపంలో ఆదివారం డీఎంకే ఆధ్వర్యంలో 48 జంటలకు ఆదర్శవివాహాలు జరిగాయి.

ఈ వివాహవేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన ఉదయనిధి మాట్లాడుతూ డీఎంకే ఆధ్వర్యంలో నిర్వహించే ఆదర్శ వివాహాల పట్ల ప్రజలు బాగా ఆకర్షితులవుతున్నారని, మూఢాచారాలకు వ్యతిరేకంగా జరిగే ఈ ఆదర్శవివాహాలు ఇటీవలి కాలంలో రాష్ట్రమంతా అధికమయ్యాయని చెప్పారు.

తన సమక్షంలో వివాహం చేసుకున్న వధూవరులకు 66 రకాల సారెవస్తువులు కానుకగా ఇవ్వడం ఆనందంగా ఉందన్నారు. ప్రత్యర్థులు ఎంత వ్యతిరేకించినా, కడుపుమంటతో రగిలిపోతున్నా తమిళ సంస్కృతి సంప్రదాయాలను, తమిళ భాషను పరిరక్షించడమే తమ ప్రధాన కర్తవ్యమని అన్నారు. డీఎంకే ప్రభుత్వం అమలు చేసే విప్లవాత్మక, అభ్యుదయపరమైన పథకాలకు మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి పేర్లు పెట్టడమేమిటని ఈపీఎస్ ప్రశ్నించడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రస్తుతం ఈపీఎస్ ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్‌షాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని, ఒకవేళ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలకు వారి పేర్లు పెట్టాలని ఆశపడుతున్నారేమోనని ఉదయనిధి ఎద్దేవా చేశారు.

మూడు నెలల క్రితం బీజేపీతో పొత్తుపెట్టుకునే ప్రసక్తే లేదంటూ ప్రకటించిన ఈపీఎస్, పది రోజుల క్రితం సేలంలో అన్నాడీఎంకే నేతల ఇళ్లల్లో ఐటీ దాడులు జరగ్గానే పొత్తుపై ఎన్నికల సమయంలో నిర్ణయం తీసుకుంటామని మాట మార్చారని ఉదయనిధి ఆరోపించారు. రాబోవు రోజుల్లో అన్నాడీఎంకే నేతల ఇళ్లల్లో ఐటీ , ఈడీ దాడులు గానీ అధికమైతే పార్టీని బీజేపీలో విలీనం చేయడానికి కూడా ఈపీఎస్ వెనుకాడరని విమర్శించారు. ఈ వివాహవేడుకల్లో మంత్రులు పొన్ముడి, పీకే శేఖర్ బాబు, ఎంపీ కళానిధి వీరాసామి, శాసనసభ్యులు ఇబ్రహీమ్ మూర్తి, కేపీ శంకర్, ఎబినేజర్ తదితరులు పాల్గొన్నారు.

చెన్నై చేరుకున్న కేంద్ర ఆర్థిక సంఘం

● నేడు సీఎం స్టాలిన్‌తో భేటీ

అడయార్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ఆర్థిక సంఘం సభ్యులు ఆదివారం నగరానికి చేరుకున్నారు. ఆ సంఘం అధ్యక్షుడు అరవింద్ పనగారియా సారథ్యంలోని ఫైనాన్స్ కమిషన్ నాలుగు రోజుల పాటు రాష్ట్రంలో పర్యటిస్తుంది. ఈ పర్యటనలో భాగంగా ఈ బృందం సోమవారం ముఖ్యమంత్రి స్టాలిన్‌తో సచివాలయంలో భేటీకానుంది. కేంద్ర, రాష్ట్రాల మధ్య నిధుల పంపిణీ అంశంపై చర్చించేందుకు కేంద్ర ఆర్థిక సంఘానికి చెందిన ఉన్నతాధికారుల బృందం.. ప్రతి ఐదేళ్ళకు ఒకసారి అన్ని రాష్ట్రాలకు వెళ్ళి ఆయా రాష్ట్రాల ముఖ్యమంత్రులతో సమావేశమవుతుంది. ఇందులోభాగంగా 16వ ఫైనాన్స్ కమిషన్ ఛైర్మన్ అరవింద్ పనగారియా సారథ్యంలో సభ్యులు అజయ్ నారాయణన్ ఝా, అనీ జార్జ్ మేథ్యూ, మనోజ్ పాండా, సౌమ్యకాంతి ఘోష్, కార్యదర్శి రిత్విక్ పాండే, సహాయ కార్యదర్శి రాహుల్ జైన్‌తో సహా 12 మంది అధికారులు ప్రత్యేక విమానంలో ఆదివారం నగరానికి చేరుకున్నారు. ఎయిర్‌పోర్టు నుంచి గిండీలోని ఓ నక్షత్ర హోటల్‌కు చేరుకున్నారు. ఆ తర్వాత వారు స్థానిక నంగనల్లూరులో ఉంటున్న ఆర్బీఐ మాజీ గవర్నర్ సి.రంగరాజన్‌ను కలిసి అనేక అంశాలపై చర్చించారు. సోమవారం ఉదయం 9.30 గంటలకు సీఎం స్టాలిన్, ఆర్థిక మంత్రితో పాటు ఇతర మంత్రులతో వారు సమావేశమవుతారు. ఈ నెల 19వ తేదీ నెమిలిచ్చేరిలోని నిర్లవణీయకరణ ప్రాజెక్టు పరిశీలిస్తారు. అక్కడ నుంచి శ్రీపెరంబుదూరు వెళ్ళి అక్కడ ఎగుమతి, దిగుమతుల యూనిట్లను పరిశీలిస్తారు. ఆ తర్వాత ప్రత్యేక విమానంలో మదురై చేరుకుని, అక్కడ నుంచి రామేశ్వరం వెళ్ళి రామనాథ స్వామి దర్శనం చేసుకుంటారు. 20వ తేదీ ధనుష్కోడి వెళతారు. కీళడిలోని భారత పురావస్తు పరిశోధనా కేంద్రానికి వెళతారు. అక్కడ నుంచి మదురై చేరుకుని ప్రత్యేక విమానంలో ఢిల్లీకి చేరుకుంటారు.

తమిళ భాషను ఎవ్వరూ నాశనం చేయలేరు

● న్యూజిలాండ్‌లో స్పీకర్ అప్పావు



ప్యారీస్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): తమిళ భాషను నాశనం చేయడం ఎవరి వల్ల కాదని, ప్రపంచంలో ఎక్కడున్నా తమిళులు మాతృభాషను చక్కగా నేర్చుకోవాలని న్యూజిలాండ్‌లో జరిగిన తమిళ సంఘం వేడుకల్లో రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ అప్పావు పేర్కొన్నారు. ఆస్ట్రేలియా సిడ్నీ నగరంలో ఈ నెల 6 నుంచి 8వ తేదీ వరకు జరిగిన 67వ కామన్‌వెల్త్ పార్లమెంటరీ సదస్సులో స్పీకర్ అప్పావు పాల్గొని ప్రసంగించారు. తర్వాత ఆయన అక్కడి కార్యక్రమాలు ముగించుకొని మెల్బోర్న్, కెయిన్స్ నగరాలకు వెళ్లి ఆ ప్రాంతాల్లో వృత్తిరీత్యా స్థిరపడిన తమిళులతో సమావేశమయ్యారు. శుక్రవారం న్యూజిలాండ్ దేశంలోని ఆక్లాండ్ నగరంలో నిర్వహించిన తమిళ సంఘం కార్యక్రమంలో అప్పావు పాల్గొన్నారు. ఆయనకు స్థానిక తమిళులు ఘనస్వాగతం పలికారు.

ఎయిర్‌పోర్ట్‌కు స్థలసేకరణ వద్దంటూ.. మదురైవాసుల ఆందోళన


ఆందోళనకారులతో చర్చిస్తున్న అధికారులు

ప్యారీస్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మదురై విమానాశ్రయ విస్తరణ పనులకు అవసరమైన స్థలాలు కైవసం చేసుకోవడాన్ని వ్యతిరేకిస్తూ గ్రామస్తులు ఆదివారం ధర్నా నిర్వహించారు. ఈ నేపథ్యంలో రెవెన్యూ శాఖ అధికారులు గ్రామస్తులతో చర్చించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన తాత్కాలికంగా విరమించుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు. మదురై విమానాశ్రయం నుంచి హైదరాబాద్, బెంగళూరు, ఢిల్లీ, ముంబై తదితర నగరాలతో పాటు సింగపూర్, దుబాయ్, శ్రీలంక వంటి దేశాలకు విమానసేవలున్నాయి. ఈ నేపథ్యంలో, విమానాల సంఖ్య పెరుగుతున్న దృష్ట్యా రన్‌వే పెంచేందుకు విమానాశ్రయ విస్తరణకు 637.15 ఎకరాలను ఎంపిక చేసిన రెవెన్యూ అధికారులు భూములు స్వాధీనం చేసుకునేందుకు చర్యలు ప్రారంభించారు. ఇదిలా ఉండగా, మదురై సమీపంలోని చిన్నఉడైప్పు గ్రామానికి భూసేకరణ కోసం వెళ్లిన అధికారులతో గ్రామస్తులు వాగ్వివాదానికి దిగారు. మదురై కార్పొరేషన్ పరిధిలో ఉన్న ప్రాంతంలో తమకు నివాసాలు ఏర్పాటుచేయాలని గతంలో జిల్లా యంత్రాంగానికి విన్నవించుకున్నా ఇళ్లు కేటాయించకుండానే భూములు కైవసం చేసుకొనేందుకు తాము అంగీకరించబోమని గ్రామస్తులు అడ్డుకున్నారు.

శనివారం భూముల సేకరణకు వెళ్లిన తహసీల్దార్ విజయలక్ష్మి సహా అధికారులను చుట్టుముట్టారు. దీంతో తిరిగెళ్లిన అధికారులు, ఆదివారం ఉదయం చిన్నఉడైప్పు గ్రామానికి వెళ్లి ఆందోళనకారులతో చర్చించి, సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన తాత్కాలికంగా విరమించుకుంటున్నట్లు ప్రకటించారు.

నయనతార - ధనుష్ మధ్య వివాదం డీఎంకే ప్రయత్నమే

● అన్నాడీఎంకే నేత గాయత్రి రఘురామ్



అడయార్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పెరిగిన మాదకద్రవ్యాల అమ్మకాలు, క్షీణించిన శాంతి భద్రతలు గురించి ప్రజల దృష్టి మరల్చేందుకే డీఎంకే ప్రభుత్వం ప్రముఖ నటి నయనతార, నటుడు ధనుష్ మధ్య వివాదాన్ని తెరపైకి తెచ్చిందని అన్నాడీఎంకే మహిళా విభాగం డిప్యూటీ కార్యదర్శి, నటి గాయత్రి రఘురామ్ ఆరోపించారు. మదురై ఓబులాపట్టితురై ప్రాంతంలో అన్నాడీఎంకే 53వ ఆవిర్భావ వేడుకల సందర్భంగా ఏర్పాటైన బహిరంగ సభలో ఆమె మాట్లాడుతూ నయనతార నటించి కోట్లు సంపాదించుకోవచ్చు, ఆమె పెళ్ళి వీడియో అమ్ముకుని కూడా కోట్లు సంపాదించుకోవచ్చు, ఈ సంపాదనల నేపథ్యంలో నటుడు ధనుష్‌తో గొడవపడితే ఏమి? గొడవపడకపోతే కలిగే నష్టం ఏమిటని ఆమె ప్రశ్నించారు. గత రెండు రోజులుగా రాష్ట్రమంతా చర్చించుకుంటున్న నయనతార, ధనుష్ ల వివాదాన్ని డీఎంకే పాలకులే తెరపైకి తెచ్చారన్నారు. నయనతార, ధనుష్ ఏం చేసుకుంటే మనకెందుకుని, దాని వల్ల ప్రజలకు ఏమైనా ఉపయోగం ఉందా అని ప్రశ్నించారు. డీఎంకే అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్క సంక్షేమ పథకం కూడా ప్రజలకు చేరడం లేదన్నారు. వచ్చే ఎన్నికల్లో డీఎంకేకు తగిన గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని గాయత్రి జోస్యం చెప్పారు.

కాంగ్రెస్‌ను 40 సీట్లకే పరిమితం చేస్తారా?

● టీఎన్‌సీసీ నేత సెల్వపెరుంతగై



చెన్నై, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): డీఎంకే కూటమిలో మిత్రపక్షంగా ఉన్న కాంగ్రెస్ పార్టీకి సొంత బలం లేదనే అపోహలున్నాయని, వాస్తవానికి రాష్ట్రంలో మళ్ళీ కాంగ్రెస్ పాలన తెచ్చే సత్తా ఉందని టీఎన్‌సీసీ నేత సెల్వపెరుంతగై అన్నారు. మహారాష్ట్రలో కాంగ్రెస్ అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం చేసి నగరానికి తిరిగివచ్చిన ఆయన మీడియాతో మాట్లాడుతూ జాతీయ పార్టీ కావడంతో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులంతా అధిష్ఠానం ఆదేశాలకు కట్టుబడి ఉండాలన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో ఏడెనిమిది ఎంపీ సీట్లు, అసెంబ్లీ ఎన్నికల్లో ఇరవై ముప్పై సీట్ల కోసం డీఎంకే కావళ్ల మోయటం కాంగ్రెస్‌కు భావ్యమేనా అనే విమర్శలు వస్తున్నాయన్నారు. ఈ సారి జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో గతంలా డీఎంకే ఇచ్చే 25 - 30 సీట్లు చాలని చెబుతారా లేదా 40 సీట్లు కావాలని ఒత్తిడి చేస్తారా అని ప్రత్యర్థులు ప్రశ్నిస్తున్నారని, జాతీయ పార్టీ కాంగ్రెస్ కెపాసిటీ 40 సీట్లకే పరిమితం చేయడం భావ్యమేనా అని సెల్వపెరుంతగై ప్రశ్నించారు రాష్ట్ర శాఖలకు ప్రత్యేక అధికారాలు కల్పిస్తే, స్థానిక పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకునే అధికారం కల్పిస్తే పార్టీ ప్రతిష్ఠ పెరుగుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ కూడా ఎప్పటి నుంచో అధికారంలో భాగస్వామ్యం గురించి చెబుతూనే ఉందని, అయితే తుది నిర్ణయం అధిష్ఠానానిదే కనుక తాము ఈ విషయంలో తొందరపడదలచుకోలేదని సెల్వపెరుంతగై అన్నారు. డీఎంకే పాలనపై ఎవరూ ఎలాంటి తప్పులు పట్టలేరని, ఆర్థిక పరిస్థితులు సవ్యంగా లేకపోయినా ప్రజా సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా సీఎం స్టాలిన్ చక్కటి పాలన అందిస్తున్నారని కితాబిచ్చారు.

సమాచార దర్శిని

సింగపూర్‌కు 18వేల లీటర్ల ఆవిన్ పాలు

పెరంబూర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): సేలం జిల్లా సహకార పాల ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో 780 పాల ఉత్పత్తిదారుల సహకార సంఘాలు పనిచేస్తున్నాయి. ఈ కేంద్రాల ద్వారా ప్రతిరోజు 5.80 లక్షల లీటర్ల పాలు సేలం ఆవిన్ కొనుగోలు చేస్తోంది. ఈ నేపథ్యంలో, స్థానిక అడయార్‌లో ఉన్న ఇండియన్ నేవీ సేలం ఆవిన్‌కు 4,000 లీటర్ల పాలు కొనుగోలుకు ఆర్డర్లు ఇచ్చింది. ఆ ప్రకారం, ఆవిన్ పాలు సరఫరా చేస్తున్న నేపథ్యంలో, మరో 6,000 లీటర్ల ఆర్డర్లను ఇండియన్ నేవీ అందజేసింది. అలాగే, సింగపూర్ నుంచి 18వేల లీటర్ల పాలకు ఆవిన్‌కు ఆర్డర్లు వచ్చాయని, డిసెంబరు రెండో వారంలోగా సింగపూర్‌కు పాలు సరఫరా చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

కొచ్చిన్‌కు అదనపు విమాన సర్వీసులు

పెరంబూర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): శబరిమల వెళ్లే అయ్యప్ప భక్తుల సౌకర్యార్థం చెన్నై-కొచ్చిన్ మధ్య అదనపు విమాన సర్వీసులు నడుపనున్నారు. అయ్యప్ప భక్తులు విమానాల్లో ఇరుముడి, టెంకాయ తీసుకెళ్లేందుకు కేంద్ర విమానయాన శాఖ అనుమతించడంతో, దేశవ్యాప్తంగా పలు నగరాల నుంచి శబరిమలై వెళ్లే అయ్యప్ప భక్తులు అధికంగా విమానాల్లో కొచ్చిన్ వెళుతున్నారు. ఈ నేపథ్యంలో, చెన్నై నుంచి నుంచి ప్రతిరోజు ఉదయం 6.30 నుంచి రాత్రి 9.25 గంటల వరకు కొచ్చిన్‌కు 8, కొచ్చిన్ నుంచి ఉదయం 10.20 నుంచి రాత్రి 11.05 గంటల వరకు చెన్నైకి 8 మొత్తం 16 విమాన సర్వీసులు నడుపనున్నారు. అలాగే, చెన్నై-బెంగళూరు-కొచ్చిన్ మధ్య లింక్ విమానాలు ప్రతిరోజు ఆరు సర్వీసులు నడువనున్నారు. అదే విధంగా, ప్రతి ఆదివారం రాత్రి 12.45 గంటలకు చెన్నై నుంచి కొచ్చిన్‌కు నేరుగా విమాన సర్వీసు ఉంటాయని అధికారులు తెలిపారు.

బహుళ సేవా కేంద్రాలుగా 3,085 సహకార సంఘాలు

పెరంబూర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఇప్పటివరకు 3,085 ప్రాథమిక సహకార సంఘాలు వివిధ రంగాల్లో సేవలందించే బహుళ సేవా కేంద్రాలుగా మారాయి. సహకార శాఖ ఆధ్వర్యంలో 4,456 ప్రాథమిక వ్యవసాయ సహకార రుణ సంఘాలున్నాయి. ఈ సంఘాలు రేషన్ దుకాణాల నిర్వహణ, రైతులకు పంట రుణాలు, ఎరువులు, విత్తనాలు అందజేస్తున్నాయి. దేశవ్యాప్తంగా సహకార సంఘాలు నష్టాల్లో నడుస్తున్నాయి. ఈ విషయమై దృష్టి సారించిన కేంద్ర ప్రభుత్వం, వ్యవసాయం మౌలిక సదుపాయాల పథకం కింద, ఈ సంఘాలను వివిధ పరిశ్రమలకు బహుళ సేవా కేంద్రాలుగా మార్చే పథకం అమలుచేసింది. ఆ ప్రకారం, సంఘాల ప్రయోజనం కోసం, ఈ సంఘాలు కొత్త వ్యాపారాలు ప్రారంభించేలా నాబార్డ్ 3 శాతం వడ్డీకి రుణం అందిస్తోంది. ఈ పథకంలో రాష్ట్రంలోని ప్రాథమిక సహకార సంఘాలు బహుళ సేవా కేంద్రాలుగా మార్చే పనులు రెండేళ్ల క్రితం ప్రారంభమయ్యాయి. ఇప్పటివరకు 3,085 సంఘాలు 7,549 వ్యవసాయ యంత్రాలు కొనుగోలు చేసి తక్కువ అద్దెకు రైతులకుఅందిస్తున్నాయి.ఆ ప్రకారం, సంఘాలకు ఆదాయం లభించడంతో పాటు, రైతులకు తక్కువ ధరకు సేవలు అందుతున్నాయని అధికారులు తెలిపారు.

ఓటరు జాబితా శిబిరాలకు స్పందన

ప్యారీస్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా 234 శాసనసభ నియోజకవర్గాలకు సంబంధించిన ఓటరు జాబితా సవరణ రెండో రోజైన ఆదివారం కూడా కొనసాగింది. రాష్ట్ర ఎన్నికల సంఘం ఏర్పాటుచేసిన 85,000 పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 10 గంటల నుంచే 18 ఏళ్లు నిండిన కొత్త ఓటర్లు తమ పేర్లు నమోదుచేసుకున్నారు. అలాగే, చిరునామా మార్పు కోసం ఓటర్లు బారులు తీరారు. రాష్ట్రానికి సంబంధించిన ముసాయిదా ఓటరు జాబితా అక్టోబరు 29వ తేది ఎన్నికల సంఘం విడుదల చేసింది. భారత ఎన్నికల కమిషన్ సూచనల మేరకు వచ్చే ఏడాది జనవరి 1వ తేదినాటికి 18 ఏళ్లు నిండిన వారంతా ఓటరు జాబితాలో పేరు నమోదుచేసేలా రాష్ట్ర ఎన్నికల సంఘం ఈ ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తోంది. మళ్లీ ఈనెల 23,24 శని, ఆదివారాల్లో ఓటర్ల జాబితా సవరణ నిర్వహించనున్నట్లు ఈసీ ప్రకటించింది.

రాజకీయ పార్టీల్లో జోష్...

అధికార డీఎంకే, ప్రతిపక్ష అన్నాడీఎంకే, కాంగ్రెస్, డీపీఐ, ఎండీఎంకే, పీఎంకే, డీఎండీకే, టీవీకే తదితర రాజకీయ పార్టీల తరఫున బూత్ కమిటీల నిర్వాహకులతో ఓటరు జాబితాలో పేర్లు నమోదుచేసే శిబిరాలు ఆదివారం జరిగాయి. పార్టీల నాయకులు, బ్యానర్లు కట్టి కొత్త ఓటర్లను ఇళ్ల వద్దకే వెళ్లి వారిని ఓటరు శిబిరాలకు తరలించి జాబితాలో పేరు నమోదు చేయించారు.

కాశిమేడు ఫిషింగ్ హార్బర్‌లో పెరిగిన రద్దీ

ప్యారీస్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక కాశిమేడు ఫిషింగ్ హార్బర్‌లో ఆదివారం రద్దీ పెరిగింది. తెల్లవారుజాము నుంచే వందల సంఖ్యలో మరపడవలు తీరానికి రావడంతో చేపలు, రొయ్యలు, పీతలు తదితరాలను వేలం వేసేందుకు స్థలం లేక వ్యాపారులు ఇబ్బందుల పాలయ్యారు. వేలంలో పాల్గొనే హోల్‌సేల్ వ్యాపారుల నుంచి చిల్లర వ్యాపారులు చేపలు కొనుగోలు చేశారు. మరోవైపు మాంసాహార ప్రియులు కూడా పెద్దసంఖ్యలో తరలివచ్చారు.

కుమారుడి అరెస్టును ఖండిస్తూ కోవైలో ధర్నా

● హిందూ మక్కల్‌కట్చి నేత అర్జున్ సంపత్ అరెస్టు

చెన్నై, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): తన కుమారుడిని అరెస్టు చేయడాన్ని ఖండిస్తూ ధర్నాకు ప్రయత్నించిన హిందూ మక్కల్ కట్చి నాయకుడు అర్జున్ సంపత్ అరెస్టయ్యారు. ఈషా యోగా కేంద్రానికి మద్దతుగా కోయంబత్తూరులో అక్టోబరు 27న హిందూ మక్కల్ కట్చి ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహించారు. ఆ సందర్భంగా అర్జున్ సంపత్ కుమారుడు ఓంకార్ బాలాజీ ప్రముఖ పాత్రికేయుడు నక్కీరన్ గోపాల్‌ను కించపరిచేలా ప్రసంగించారు. దానికి సంబంధించి కోవై రేస్‌కోర్సు పోలీసులు ఓంకార్ బాలాజీపై కేసు నమోదు చేశారు. ముందస్తు బెయిలు కోరుతూ బాలాజీ హైకోర్టులో పిటిషన్ వేశారు. దానిని విచారణకు స్వీకరించిన హైకోర్టు కేసు విచారణ జరిగేంతవరకూ ఓంకార్ బాలాజీని అరెస్టు చేయకూడదంటూ స్టే విధించారు. ఈ నెల 13న ఈ కేసు విచారణకు రాగా నక్కీరన్ గోపాల్‌పైచేసిన వ్యాఖ్యలకు ఓంకార్ బాలాజీ క్షమాపణ చెప్పడానికి అంగీకరించలేదు. దీనితో ఓంకార్ బాలాజీని పోలీసులు అరెస్టుచేయకుండా విధించిన స్టేను కొనసాగించేందుకు హైకోర్టు నిరాకరించింది. ఆ తర్వాత కోర్టు నుండి వస్తున్న ఓంకార్‌బాలాజీని పోలీసులు అరెస్టు చేశారు. దీంతో ఓంకార్ బాలాజీ అరెస్టును ఖండిస్తూ ఆదివారం రెడ్‌క్రాస్ భవనం కూడలి వద్ద ధర్నా చేస్తున్నట్లు హిందూ మక్కల్ కట్చి నేత అర్జున్ సంపత్ ప్రకటించారు. పోలీసులు ధర్నాకు అనుమతి నిరాకరించారు. ఈనేపథ్యంలో ఆదివారం ఉదయం ఆయన కోయంబత్తూరులో


రోడ్డుపై పడుకుని పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న అర్జున్ సంపత్

అనుచరులతో కలిసి ధర్నా జరిపేందుకు ప్రయత్నించారు. పోలీసులు జోక్యం చేసుకుని అర్జున్ సంపత్ సహా ఆయన అనుచరులు 25మందిని అరెస్టు చేసి జైలుకు తరలించారు.

పంబ నుంచి నగరానికి వచ్చిన తొలి బస్సు

ప్యారీస్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రం నుంచి శబరిమల వెళ్లి మొక్కులు చెల్లించుకొని తిరిగొచ్చే అయ్యప్ప భక్తుల కోసం తమిళనాడు ప్రభుత్వ ఎక్స్‌ప్రెస్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ కేరళలోని పంబ వరకు ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతోంది. ఈ నెల 15వ తేది నుంచి కోయంబేడు, కిలంబాక్కం బస్ టెర్మినల్ నుంచి పంబకు ప్రత్యేక బస్సులు నడిపారు. అనంతరం పంబ నుంచి బయల్దేరిన మొదటి బస్సు ఆదివారం ఉదయం అయ్యప్ప భక్తులను తీసుకుని కిలంబాక్కం చేరింది. ఈ బస్సు కేరళలోని నిలక్కల్ ప్రాంతానికి వెళ్లకుండా నేరుగా పంబ నుంచి బయల్దేరే సదుపాయం కల్పించారు. రాష్ట్రం నుంచి వేలాది మంది అయ్యప్ప భక్తులు శబరిమల వెళ్తున్న దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వ రవాణా సంస్థ పంబ వరకు ప్రత్యేక బస్సు సర్వీసులు పరిచయం చేయడం గమనార్హం.

23 వరకు దివ్యాంగుల వైద్యశిబిరం

పెరంబూర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల సంక్షేమ సంఘం 2023 సెప్టెంబరు నుంచి ఈ ఏడాది మార్చి వరకు నిర్వహించిన సర్వేలో నగరంలో 1,731 మంది దివ్యాంగులు సర్టిఫికెట్లు పొందలేదని తెలిసింది. వారికి గుర్తింపుకార్డులు ఇచ్చేందుకు ఆరోగ్యశాఖ గత నెల 29 నుంచి గురువారం వరకు ప్రత్యేక వైద్యశిబిరం ఏర్పాటుచేసి, దివ్యాంగులకు పరీక్షలు నిర్వహించి సర్టిఫికెట్లు అందజేశారు. స్టాన్లీ, కీల్పాక్కం జనరల్ ఆస్పత్రులు, కీల్పాక్కం మానసిక వైద్యశాల, ఎగ్మూర్ కంటి ఆస్పత్రుల్లో ఏర్పాటు చేసిన శిబిరాలు ఈ నెల 23వ తేది వరకు పొడిగించినట్లు అధికారులు తెలిపారు. ఉత్తర చెన్నై సంక్షేమ కార్యాలయం పరిధిలోని మండలం 1 నుంచి 8 వరకు పరిధిలో నివసించే దివ్యాంగులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని ఆరోగ్యశాఖ తెలిపింది.

పాఠశాల, కళాశాలల హాస్టళ్ల అనుసంధానం

పెరంబూర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆదిద్రావిడ సంక్షేమ శాఖ చేపట్టిన 'మిక్స్‌డ్ హాస్టల్' ప్రాజెక్ట్‌లో 13 జిల్లాల్లో 10 పాఠశాల, కళాశాల విద్యార్థులను ఒకేచోట హాస్టళ్లలో చేర్చారు. రాష్ట్రవ్యాప్తంగా 1,300 ఆదిద్రావిడ సంక్షేమ హాస్టళ్లలో 90,000 మందికి పైగా విద్యార్థులుంటున్నారు. ఈ నేపథ్యంలో, పదేళ్లుగా హాస్టల్స్ ఉండి చదువుకొనే విద్యార్థుల సంఖ్య క్రమంగా తగ్గుతోంది. దీంతో, మిక్స్‌డ్ హాస్టల్ ప్రాజెక్ట్‌లో పాఠశాల, కళాశాలల విద్యార్థులను ఒకేచోట ఉండేలా హాస్టల్స్ ఏర్పాటయ్యాయి. ఆ ప్రకారం, నీలగిరి, తిరునల్వేలి, తంజావూరు, దిండుగల్ సహా 13 జిల్లాల్లో 10 మిక్స్‌డ్ హాస్టల్స్ ఏర్పాటయ్యాయి. ఈ హాస్టల్ భవనాల్లో కింది అంతస్తులో పాఠశాల విద్యార్థులు, ఒకటి, రెండవ అంతస్తులో కళాశాల విద్యార్థులకు వసతి కల్పించగా, ఇద్దరు వార్డెన్‌లను నియమించినట్లు అధికారులు తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెరంబూర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా దిగువ ప్రాంతాల్లో సోమవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

తండయార్‌పేట: గుమ్మాలమ్మన్ ఆలయ వీధి, జీఏ రోడ్డు, టీహెచ్ రోడ్డు కొంత భాగం, సోలయప్పన్ వీధి, కప్పల్ బాలు వీధి, వీబీ ఆలయ వీధి, తాండవరాయన్ వీధి, రెయిన్ హాస్పిటల్, రంగమ్మాల్ వీధి, రామానుజం వీధి, సంజీవరాయన్ వీధి, సుబ్బరాయన్ వీధి, బాలు మొదటి వీధి, ఓల్డ్ వాషర్‌మెన్‌పేట, ఇళయ మొదటి వీధి కొంత భాగం, మన్నప్పన్ వీధి కొంత భాగం, తంగవేలు వీధి, నైనియప్పన్ వీధి, పెరుమాళ్ ఆలయ వీధి, వీరకుట్టి వీధి, కేజీ గార్డన్, మేయర్ బాసుదేవ్ వీధి

తిరుముల్లైవాయల్: మోరై, మోరై ఇండస్ట్రియల్ ఎస్టేట్, వెల్‌టెక్ మెయిన్ రోడ్డు, షీలా నగర్, విజయలక్ష్మి నగర్, శ్రీనివాస నగర్, సప్తగిరి నగర్, భార్గవి నగర్

బెంగళూరులో డ్రగ్స్ సప్లయర్ అరెస్టు

అడయార్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు మత్తు పదార్థాలను సరఫరా చేసే నైజీరియా స్మగ్లర్‌ను ప్రత్యేక బృందం పోలీసులు బెంగళూరులో అరెస్టు చేశారు. నగరంలో మెట్టబెటమైన్ అనే డ్రగ్ సరఫరా చేసిన కేసులో గత నెలలో మొత్తం 12 మంది స్మగ్లర్లను అరెస్టు చేశారు. వారిని విచారించగా నైజీరియాకు చెందిన ఫిలిప్ అనే వ్యక్తి వాట్సాప్ గ్రూపు ద్వారా సంప్రదిస్తూ బెంగళూరు నుంచి డ్రగ్ సరఫరా చేస్తున్నట్లు వెల్లడించారు. దీంతో అతడిని ప్రత్యేక బృందం పోలీసులు వలపన్ని అరెస్టు చేశారు. నైజీరియా నుంచి అక్రమంగా బెంగళూరుకు డ్రగ్ తెప్పించి, అక్కడ నుంచి చెన్నైకు సరఫరా చేస్తున్నట్టు వెల్లడించారు. కేసు నమోదు చేసి మరిన్ని వివరాలను ఆరాతీస్తున్నారు.

జిప్మర్ వైద్యుడి ఆత్మహత్యాయత్నం

ప్యారీస్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కేంద్రపాలిత రాష్ట్రం పుదుచ్చేరి జిప్మర్ ఆస్పత్రిలో వైద్యుడిగా పనిచేస్తున్న రవీంద్రన్ (25) కత్తితో గొంతు కోసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. గోరిమేడు ఆనంద నగర్‌కు చెందిన పారిశ్రామికవేత్త గోపాల్ ఇద్దరు కుమారులు వైద్యులుగా పనిచేస్తున్నారు. పెద్ద కుమారుడు రవీంద్రన్ జిప్మర్ ఆస్పత్రిలో పనిచేస్తూ కొన్ని నెలలుగా మానసిక ఒత్తిడికి గురైనట్లు తెలిసింది. గత సెప్టెంబరులో జరిగిన ఎండీ పరీక్షలకు రేయింబవళ్లు చదువుకున్న అతను తీవ్రంగా అలసట చెందాడని, దీంతో ఒత్తిడి గురైన ఆయన ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు గోరిమేడు ఎస్‌ఐ రమేష్ ఆదివారం మీడియాకు వివరించారు.


తిరువళ్లూర్ జిల్లా పళ్లిపట్టులో ఆదివారం ఏర్పాటుచేసిన ఓటరు ప్రత్యేక శిబిరంలో పాల్గొన్న తిరుత్తణి ఎమ్మెల్యే చంద్రన్ (చిత్రంలో) యూనియన్ కార్యదర్శి సీజే శ్రీనివాస్, పట్టణ కార్యదర్శి సీజే సెంథిల్‌కుమార్, పళ్లిపట్టు పంచాయతీ కౌన్సిల్ సభ్యులు ఎం.గుణశేఖర్, వి.చిరంజీవి, యు.జగదీష్,కె.మురళి, జె.రామదాస్, బీఎల్‌ఏ సెక్షన్ ఏజెంట్లు ఎస్‌ఏ ఖలీల్, దివాకర్ తదితరులు

సైనిక శిక్షణ శిబిరం వద్ద వైద్యశిబిరం

వేలూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): సైనికాధికారుల శిక్షణ ఈ నెల 19 నుంచి 23వ తేది వరకు నగరంలో జరుగనుంది. ఈ శిబిరం వద్ద వైద్యశిబిరం ఏర్పాటుచేయాలని ప్రభుత్వ వైద్యకళాశాల ఆస్పత్రి ప్రిన్సిపాల్ రోహిణీ దేవికి ఇండియా వైద్య సంఘం సెక్రటరీ, వేలూరు మండల ఫైర్‌మార్షల్, అగ్నిమాపక శాఖ, విముక్తి పనుల భద్రతాధికారి డా.ఇక్రమ్ లేఖ అందించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రిన్సిపాల్ గౌరి, వెల్లింగ్టన్ సైనికాధికారి మణివన్నన్, కాట్పాడి రెడ్‌క్రాస్ అధ్యక్షుడు జనార్దనన్ తదితరులున్నారు.


ఆస్పత్రి ప్రిన్సిపాల్ రోహిణీ దేవికి వినతిపత్రం సమర్పిస్తున్న నిర్వాహకులు

కాగా, శిక్షణా శిబిరం వద్ద వైద్య శిబిరం ఏర్పాటుకు ఆసుపత్రి ప్రిన్సిపాల్ రోహిణి దేవి అంగీకరించారని నిర్వాహకులు తెలిపారు.

గర్భిణులకు పౌష్టికాహారం అవసరం

● ఎమ్మెల్యే చంద్రన్

తిరుత్తణి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): గర్భిణులకు పౌష్టికాహారం అవసరమని ఎమ్మెల్యే చంద్రన్ తెలిపారు. పళ్లిపట్టు సమీపం అత్తిమాంజేరిపేటలోని అంగన్వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహార కిట్లు పంపిణీ ఆదివారం జరిగింది. మండల చిన్నారుల సంరక్షణ అధికారి డానియా అధ్యక్షత వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్థానిక ఎమ్మెల్యే చంద్రన్ పాల్గొని గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహార కిట్లు అందజేశారు. బీడీజీ మిల్కా రాజాసింగ్, యూనియన్ డీఎంకే కార్యదర్శి చంద్రన్, వైఎస్ భారతి సహా పలువురు పార్టీ నేతలు, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.


గర్భిణులకు పౌష్టికాహార కిట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే

ప్రజలు భక్తి భావాన్ని అలవర్చుకోవాలి

● ధర్మకర్త పొన్నేరి రాధాకృష్ణ

అడయార్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ భక్తి భావాన్ని అలవరుచుకోవాలని ఓల్డ్ వాషర్‌మెన్‌పేటలోని కపిల వినాయక దేవస్థాన ధర్మకర్త పొన్నేరి రాధాకృష్ణ పిలుపునిచ్చారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా చెన్నపురి దేవాంగ సంఘం ఆధ్వర్యంలో కపిల వినాయక దేవాలయంలోని కాశీ విశాలాక్షి సమేత కాశీ విశ్వనాథుడికి ప్రత్యేక పూజలు, అన్నాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త పొన్నేరి రాధాకృష్ణ అన్నదానానికి సహకరించిన భక్తులకు ధన్యవాదాలు తెలిపారు. దేవాంగ సంఘం ఉపాధ్యక్షుడు దోనపర్తి తారాచంద్రన్, సీనియర్ సభ్యులు మునిరత్నం మాచెర్ల, కార్యదర్శి వేంకటేశ్వర్లు, సంఘం అధ్యక్షుడు జనార్దనం, కోశాధికారి భరణి ఉమ్మటి తదితరులు పాల్గొన్నారు.


కాశీ విశ్వనాథ ఆలయంలో కార్తీక పౌర్ణమి పూజలు

4 సినిమాలు హిట్ కాగానే సీఎం పదవిపై ఆరాటం

● విజయ్‌పై సెల్లూర్ రాజు సెటైర్లు

అడయార్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాజకీయ పార్టీ స్థాపించిన హీరో విజయ్‌పై అన్నాడీఎంకే సీనియర్ నేత, మాజీ మంత్రి సెల్లూర్ రాజు విమర్శలు గుప్పించారు. నాలుగు సినిమాలు హిట్ కాగానే ముఖ్యమంత్రి కుర్చీపై ఆశ కలుగుతుందని ఆయన వ్యాఖ్యానించారు. శనివారం మదురైలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన రాష్ట్రంలో నాలుగు చిత్రాలు బాగా ఆడితే చాలు.. తదుపరి ముఖ్యమంత్రి నేనే అంటూ డంకా బజాయిస్తున్నారంటూ వ్యాఖ్యానించారు. కాగా, ఈ మాజీ మంత్రి... హీరో విజయ్‌ను లక్ష్యంగా చేసుకునే విమర్శలు గుప్పించారనే చర్చ సాగుతుంది.

నకిలీ పాస్‌పోర్ట్‌తో ఇద్దరి అరెస్ట్

ప్యారీస్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): విదేశాలకు వెళ్లేందుకు తిరుచ్చి విమానాశ్రయానికి నకిలీ పాస్‌పోర్ట్‌తో వచ్చిన ఇద్దరిని అరెస్ట్ చేశారు. పుదుకోట జిల్లా అలంగుడికి చెందిన అమీర్‌హుస్సేన్ (48) శుక్రవారం తిరుచ్చిలోని అంతర్జాతీయ విమానాశ్రయానికి వెళ్లగా అక్కడ ఇమ్మిగ్రేషన్ అధికారుల తనిఖీల్లో అమీర్ తల్లిదండ్రుల పేర్లు, పుట్టిన ఊరు, పుట్టిన తేదీ తదితర వివరాలు నకిలీవి సమర్పించి పాస్‌పోర్ట్ పొందినట్లు తెలిసింది. దీంతో ఆయనను అదుపులోకి తీసుకున్న అధికారులు విమానాశ్రయ పోలీసులకు అప్పగించారు. అదే విధంగా శివగంగ సమీపంలోని తిరుపత్తూర్‌కు చెందిన కదిరేశన్ (46) మలేసియా నుంచి తిరుచ్చి విమానాశ్రయం చేరుకున్నారు. ఆయన పాస్‌పోర్ట్ పరిశీలించిన అధికారులు అది నకిలీదని గుర్తించి అరెస్ట్ చేశారు.

అంబత్తూరులో 'టెండర్ కట్స్' స్టోర్

అడయార్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): నగర శివారు ప్రాంతమైన అంబత్తూరులో టెండర్ కట్స్ 17వ స్టోర్ ప్రారంభించారు. చెన్నైలో 16 ప్రాంతాల్లో ఈ స్టోర్లున్నాయి. ఈ స్టోర్లలో ప్రీమియం క్వాలిటీ చేపలు, మాంసం లభ్యమవుతుంది. ఈ స్టోర్ ప్రారంభించిన తర్వాత టెండర్ కట్స్ సీఈవో అంగద్ సింగ్ మాట్లాడుతూ 2025 నాటికి మరింత విస్తరణ దిశగా అడుగులు వేస్తుందన్నారు. 2026 డిసెంబరు నాటికి రూ.100 కోట్ల టర్నోవర్ లక్ష్యంగా పయనిస్తామన్నారు. దేశ వ్యాప్తంగా ఆరు ప్రధాన నగరాల్లో వంద షాపులను ఏర్పాటు చేయాలన్న లక్ష్యాన్ని పెట్టుకున్నట్లు తెలిపారు. కస్టమర్లు ఆర్డర్ ఇచ్చిన తర్వాతే మాంసం ముక్కలను కత్తిరిస్తామని తెలిపారు.


షోరూమ్ ప్రారంభోత్సవ దృశ్యం

సెల్వ వినాయకుడికి విశేష పూజలు

ప్యారీస్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక ట్రిప్లికేన్ దేవరాజ మొదలి వీధిలో ఉన్న సెల్వవినాయక ఆలయంలో స్వామివారికి ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. ఈ ఆలయ మహా కుంభాభిషేకం గురువారం వైభవంగా జరిగింది. అప్పటి నుంచి మండల పూజలు ప్రారంభమయ్యాయి. ఆలయ నిర్వాహకులు, దక్షిణ చెన్నై ఉత్తర పశ్చిమ జిల్లా అన్నాడీఎంకే ఎంజీఆర్ మండ్రం జిల్లా కార్యదర్శి ఆర్పీ సెల్వకుమార్, జ్యోతి, అశోక్, తమిళ్ సెల్వి, ధనుంజయులు, ఇళవరసి పర్యవేక్షణలో గణనాథుడికి పూజలు నిర్వహించి భక్తులకు అన్నదానం చేశారు.


పూజల్లో ఆలయ ధర్మకర్త సెల్వకుమార్, అర్చకులు

30 వరకు పంటల బీమాకు అవకాశం

పెరంబూర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం కింద బీమా గడువును ఈ నెల 30వ తేది వరకు పొడిగించారు. రాష్ట్రంలో ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకంలో వరి పంటకు బీమా చేసుకొనే గడువు ఈ నెల 15వ తేదీతో ముగిసింది. ఈ క్రమంలో బీమా గడువు పొడిగించాలని వివిధ రైతు సంఘాలు ముఖ్యమంత్రి స్టాలిన్, సంబంధిత శాఖల మంత్రులకు విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తితో, పంట బీమా గడువు ఈ నెల 30వ తేది వరకు కేంద్ర ప్రభుత్వం పొడిగించిందని అధికారులు తెలిపారు.


పావురం నమూనాలో విద్యార్థులు

కపోతం ఆకారంలో విద్యార్థులు

పెరంబూర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): దిండుగల్ జిల్లా వత్తలగుండులోని అన్నై వేలాంకన్ని మెట్రిక్ మహోన్నత పాఠశాలలో శనివారం బాలల దినోత్సవం నిర్వహించారు. పాఠశాల ప్రవేశద్వారం వద్ద 'మాకు యుద్ధం వద్దు... ప్రపంచ శాంతి కావాలి' అనే నినాదంతో కూడిన పతాకం ఎగురవేశారు. అనంతరం దివంగత మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ వేషధారణలో విద్యార్థులు 'శాంతి కపోతం' ఆకారంలో నిల్చొని, ప్రపంచ శాంతి కావాలంటూ నినాదలు చేశారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ పాల్ రాజ్, అసిస్టెంట్ హెడ్మాస్టర్ సరస్వతి, సిస్టర్ రెజినా, ఉపాధ్యాయులు ఇలక్కియ తదితరులు పాల్గొన్నారు.

మెదడు నిర్జీవమైన వ్యక్తి అవయవదానం


అవినాష్ ఆనందన్ (ఫైల్‌ఫొటో)

వేలూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక ముళ్లపాళ్యంకు చెందిన అవినాష్ ఆనందన్ (32) బెంగళూరులో నర్సింగ్ డిప్లొమో చేస్తున్నాడు. అతను ఈ నెల 14న ద్విచక్రవాహనంలో వాణియంబాడి వెళ్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి సీఎంసీలో చికిత్స పొందుతున్నాడు. అక్కడ చికిత్స ఫలించక శనివారం మెదడు నిర్జీవమైందని వైద్యులు నిర్ధారించారు. వైద్యుల సూచనలతో ఆనందన్ అవయవాలు దానం చేసేందుకు కుటుంబసభ్యులు అంగీకరించారు. ఆ ప్రకారం ప్రత్యేక శస్త్రచికిత్స ద్వారా వెలికితీసిన గుండెను ఎంజీఎం ఆసుపత్రి/అపోలో ఆసుపత్రి, లంగ్స్ చెన్నై ఎంజీఎం ఆసుపత్రి, లివర్ వేలూరు సీఎంసీ (రాణిపేట క్యాంపస్), ఎడమ కిడ్నీ వేలూరు సీఎంసీ ఆసుపత్రి, కుడి కిడ్నీ వేలూరు నారాయణి ఆస్పత్రి, నేత్రాలు వేలూరు సీఎంసీకి ఆదివారం అందజేశారు. అరవిందన్ అవివాహితుడు కాగా, తండ్రి మృతిచెందగా, తల్లి సత్య ఓ నర్సరీ పాఠశాలలో పనిచేస్తోంది. అతడి చెల్లెలు అను వేలూరు సీఎంసీ ఆస్పత్రిలో స్టాఫ్ నర్స్‌గా పనిచేస్తున్నారు.

ఆక్రమణల తొలగింపు


ఆక్రమించిన ఇళ్లు తొలగిస్తున్న దృశ్యం

వేలూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక కాట్పాడి కలిస్‌జార్ ధారాపడీడు చెరువులో ఉన్న ఇళ్లు తొలగిస్తున్నారు. ధారాపడవీడు చెరువు, పరిసరాలను రూ.28 కోట్లతో పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తున్నారు. ఈ చెరువును ఆక్రమించి 287 ఇళ్లు నిర్మించారు. ఆ ఇళ్లను నీటిపారుదల శాఖ ఏఈ రామ్‌కుమార్, అసిస్టెంట్ నిర్వాహక ఇంజనీర్ గోపి నేతృత్వంలో సిబ్బంది తొలగిస్తున్నారు. తొలగించిన ఇళ్ల యజమానులకు ప్రత్యామ్నాయంగా కరిగిరి ప్రాంతంలో స్థలాలు కేటాయించారు. కాగా, తొలగింపు పనులను ఆ ప్రాంత వాసులు అడ్డుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా కాట్పాడి డీఎస్పీ పళని నేతృత్వంలో సుమారు వంద మందికి పైగా పోలీసులు భద్రతా విధులు చేపట్టారు.

ఈదురుగాలులకు కూలిన భారీ వృక్షం



వేలూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక అన్నా ఆడిటోరియం సమీపం కోట ప్రాంగణంలోని 30 అడుగుల చెట్టు ఆదివారం తెల్లవారుజామున కూలింది. ఈ వృక్షం విద్యుత్ స్తంభంపై పడడంతో అది కూడా ధ్వంసమైంది. స్థానికుల సమాచారంతో విద్యుత్, అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకొని సహాయ చర్యలు చేపట్టారు. చెట్టు కూలిన సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పిందని అధికారులు తెలిపారు.

ఏఐటీసీసీటీ ఆధ్వర్యంలో అన్నదానం


పెరంబూర్ మురసోలి పార్క్ వద్ద అన్నదానం నిర్వహిస్తున్న ప్రేమ్‌కుమార్, బాబూరావు తదితరులు

ప్యారీస్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆలిండియా ట్రూ క్రిస్టియన్ కౌన్సిల్ (ఏఐటీసీసీటీ) తమిళనాడు విభాగం ఆధ్వర్యంలో ఆదివారం పేదలకు అన్నదానం చేశారు. సంస్థ చైర్మెన్ డా.జయశాలి పీడీ సుందరావు 75వ జన్మదినాన్ని పురస్కరించుకుని పెరంబూర్‌లోని మురసోలి పార్క్ వద్ద పేదలకు అన్నదానం అందజేశారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి పారిశుధ్య కార్మికులకు, ఫుట్‌పాత్ వాసులకు పంచిపెట్టారు. నిర్వాహకులు ఇ.ప్రేమ్‌కుమార్, ఇ.బాబూరావు, ఇ.విజయపాల్, పి.వసంత్‌కుమార్, బి.హేమ్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

● ఆహారంలో బొద్దింకలు...

ఒప్పంద సంస్థకు రూ.50 వేల జరిమానా

పెరంబూర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): వందే భారత్ రైలులో అందజేసిన ఆహారంలో బొద్దింకలున్న వ్యవహారంలో సదరు ఆహారం సరఫరా చేసిన సంస్థకు రూ.50వేల జరిమానా విధించారు. తిరునల్వేలి నుంచి చెన్నైవస్తున్న వందే భారత్ రైలులో రైలులో శనివారం ఉదయం ప్రయాణించిన ఓ వ్యక్తికి అందజేసిన సాంబారు ఇడ్లీలో మూడు చిన్న బొద్దింకలున్న విషయం తెలిసిందే. ఈ దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఈ వ్యవహారంపై స్పందించిన దక్షిణ రైల్వే ఆహారం సరఫరా చేసిన సంస్థకు రూ.50 వేలు జరిమానా విధించింది.

ఉద్యోగం పేరుతో మోసం

● మహిళా సర్పంచ్ అరెస్టు

అడయార్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కన్నియాకుమారి జిల్లాకు చెందిన పలువురు యువకులకు ఉద్యోగాల పేరిట మోసం చేసిన కేసులో గ్రామ పంచాయతీ మహిళా సర్పంచ్ సలోమీ సహా ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. మార్తాండంకు చెందిన అరుణ్ అనే పట్టభద్రుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కొల్లంజి గ్రామ పంచాయతీ సర్పంచ్ సలోమి (50) ఆమె భర్త శోభిదాస్ (54), సూలాల్ ప్రాంతానికి చెందిన సింధు (47) అనే మహిళను అరెస్టు చేశారు. ఈ కేసుతో సంబంధం ఉన్న మరో ఐదుగురి కోసం పోలీసులు గాలిస్తున్నారు.

తీరానికి కొట్టుకొచ్చిన యువకుల మృతదేహాలు

పెరంబూర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మహాబలిపురం సముద్ర తీరంలో స్నానం చేస్తూ గల్లంతైన ఇద్దరు యువకుల మృతదేహాలు ఆదివారం తీరానికి కొట్టుకొచ్చాయి. అన్నానగర్ కంబర్ కాలనీకి చెందిన గిరీస్ కేశవ్ (20), రియాజ్ (18) శనివారం స్నేహితులతో మహాబలిపురం బీచ్‌లో స్నానం చేస్తూ అలల్లో చిక్కుకొని గల్లంతయ్యారు. ఈ క్రమంలో, గిరీస్ కేశవ్ మృతదేహం కల్పాక్కం, రియాజ్ మృతదేహం మహాబలిపురం తీరానికి కొట్టుకొచ్చాయి. మృతదేహాలను పోస్టుమార్టంకు తరలించిన పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

పొత్తు కోసం అన్నాడీఎంకేని ఆహ్వానించలేదు!

● బీజేపీ నేత హెచ్ రాజా

చెన్నై, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బీజేపీ బలం పెరుగుతోందని సొంతబలంపై ఏ ఎన్నికల్లో అయినా పోటీ చేసే సత్తా కూడా ఉందని, ఈ పరిస్థితులలో తమ కూటమిలో చేరమంటూ అన్నాడీఎంకేని ఆహ్వానించలేదని బీజేపీ రాష్ట్ర శాఖ సమన్వయకర్త హెచ్.రాజా అన్నారు. ఆదివారం పుదుకోటలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాము ఏ పార్టీని కూడా ఏ టీమ్, బీ టీమ్ అంటూ చెప్పలేదని అన్నాడీఎంకే నేతలను పొత్తుపెట్టుకునేందుకు రావాలని పిలువలేదన్నారు. రాష్ట్రంలో ఏయే పార్టీలతో పొత్తులు పెట్టుకోవాలనే విషయంపై పార్టీ జాతీయ కమిటీ నిర్ణయం తీసుకుంటుందన్నారు. రాష్ట్రంలో ద్రావిడ తరహా పాలన అందిస్తున్నట్లు డీఎంకే నేతలు చెప్పుకోవడం వింతగా ఉందన్నారు. ద్రావిడ అనేది తమిళ పదం కాదని, అది సంస్కృత పదమని, అది ఓ ప్రాంతం గురించి తెలియజేస్తుందని రాజా అన్నారు. డీఎంకే ప్రభుత్వం అన్ని రంగాల్లో ఘోరంగా వైఫల్యం చెందిందని ఆరోపించారు.

ఆత్మకథ

రాయనున్న రజనీకాంత్?



సూపర్‌స్టార్ రజనీకాంత్ తన ఆత్మకథ రాయనున్నట్టు సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం సాగుతోంది. ఈ ప్రచారాన్ని రజనీకాంత్, ఆయన సన్నిహితులు ఖండించడం లేదా సమర్థించడం గాని చేయకపోవడం గమనార్హం. ప్రస్తుతం లోకేష్ కనకరాజ్ దర్శకత్వంలో రూపొందుతున్న 'కూలీ' చిత్రం షూటింగులో బిజీగా ఉన్న రజనీకాంత్... ఆ తర్వాత 'జైలర్-2'లో నటించనున్నారు. ఈ రెండు చిత్రాలను పూర్తి చేసిన తర్వాత ఆయన తన బయోగ్రఫీ రాయనున్నారనే ప్రచారం సాగుతోంది. సూపర్‌స్టార్‌గా ఎదిగినా చాలా నిరాడంబరమైన జీవితాన్ని గడుపుతూ కోట్లాది మంది అభిమానులను ఆయన సంపాదించుకున్నారు. స్వదేశంలోనే కాకుండా జపాన్ వంటి దేశాల్లో సైతం రజనీకాంత్‌కు అభిమానులు, ఫ్యాన్స్ క్లబ్‌లున్నాయి. అలాగే, చాలా మందికి రజనీకాంత్ సినీ ప్రస్థానం గురించి మాత్రమే తెలుసు. కానీ, ఆయన వ్యక్తిగత జీవిత విషయాలు మాత్రం ఎవరికీ తెలియవు. కర్ణాటకలో బస్ కండక్టరుగా పనిచేస్తూ, స్నేహితుడి సలహాతో ఇండస్ట్రీలోకి వచ్చారని మాత్రమే తెలుసు. సోషల్ మీడియాలో వైరలవుతున్నట్టుగా ఆయన ఆత్మకథ రాస్తే మాత్రం అది ఆయన అభిమానులకు ఇచ్చే అరుదైన బహుమతిగా భావించవచ్చు.

చిత్రజ్యోతి

ప్రతిభతో పాటు అదృష్టం ఉండాలి

● పార్వతి నాయర్



చిత్రపరిశ్రమలో రాణించాలంటే ప్రతిభతో పాటు అదృష్టం కూడా ఉండాలని యంగ్ హీరోయిన్ పార్వతి నాయర్ అంటున్నారు. 'ఎన్నై అరిందాల్', 'ఉత్తమ విలన్', 'నిమిర్' వంటి పలు చిత్రాల్లో నటించిన ఈ మలయాళ బ్యూటీ.. అగ్రహీరో విజయ్ నటించిన 'ది గోట్' చిత్రంలోనూ నటించారు. ప్రస్తుతం 'ఆలంబన' అనే మూవీలో నటిస్తున్నారు. ఇండస్ట్రీలో రాణించే విషయంపై ఆమె స్పందిస్తూ, 'దక్షిణ భారత చిత్రాల్లో అగ్రహీరోల చిత్రాల్లో నటించే భాగ్యం నాకు దక్కింది. దీనికి కారణం నా అదృష్టమే. సంతోషంగా ఉండాలంటే పెద్ద స్టార్‌గా ఉండనక్కర్లేదు. అన్ని విషయాలు, అన్ని సందర్భాలు నటీనటులకు సానుకూలంగా ఉండవు. ప్రతిభ పుష్కలంగా ఉన్నప్పటికీ అదృష్టం కూడా కీలక పాత్ర పోషిస్తుంది' అని పేర్కొన్నారు.

కమల్ లేని శృతిని ఊహించలేకపోతున్నా

తన తండ్రి కమల్ హాసన్ లేని శృతిగా తనను తాను ఊహించుకోలేకపోతున్నానని హీరోయిన్ శృతిహాసన్ అంటున్నారు. పైగా తన తండ్రి కీర్తి, ప్రతిష్ఠలకు దూరంగా ఉంటూ తనకంటూ ప్రత్యేక గుర్తింపును తెచ్చుకునేందుకు ప్రయత్నించినప్పటికీ అది సాధ్యపడలేదన్నారు. తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ, 'అన్ని సందర్భాల్లో ప్రజలు నా తండ్రి గురించే ప్రస్తావన తెస్తుంటారు. అపుడు నాకు నేను శృతిని, నాకంటూ సొంత గుర్తింపు కావాలి అని అనుకుంటాను. కానీ, ప్రజలు మాత్రం నన్ను చూస్తూ అదిగో కమల్ హాసన్ కుమార్తె అంటుంటారు. చిన్నప్పటి నుంచి నేను కలుసుకున్న వారికంటే ఆయన భిన్నమైన వ్యక్తి అని తెలుసు. ఇద్దరు బలమైన వ్యక్తుల మధ్య నేను పెరిగాను. ఆ దృఢ సంకల్పం, నాకు, నా చెల్లి అక్షరకు వచ్చింది. అమ్మానాన్నలు విడిపోయిన తర్వాత ముంబై వెళ్ళిపోయాను. అతని పోస్టర్ ప్రతిచోటా ఉన్నపుడు తండ్రి కీర్తి నుంచి వైదొలగడం కష్టమనిపించింది. ఇపుడు కమల్ లేని శృతిని ఊహించుకోవడానికి కూడా ఇష్టపడటం లేదు' అని శృతిహాసన్ పేర్కొన్నారు.



55వ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌కు 'అయలి'

ముత్తుకుమార్ దర్శకత్వంలో రూపొందిన 'అయలి' వెబ్ సిరీస్ 55వ అంతర్జాతీయ చిత్రోత్సవాలకు నామినేట్ అయింది. మొత్తం ఎనిమిది ఎపిసోడ్‌లు కలిగిన ఈ వెబ్ సిరీస్‌లో అభినక్షత్ర, అనుమోల్, అరువి మదన్, లింగా, సింగంపులి తదితరులు ప్రధాన పాత్రలు పోషించారు. గత జనవరి 26వ తేదీన ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లో స్ట్రీమింగ్ అయింది. ఈ వెబ్‌సిరీస్ ప్రతి ఒక్కరి ప్రశంసలు అందుకుంది. బాలికా విద్య ఆవశ్యకత తెలియజేస్తూ తెరకెక్కింది. ఈ నేపథ్యంలో గోవాలో జరుగనున్న 55వ అంతర్జాతీయ చిత్రోత్సవ వేడుకల్లో ఉత్తమ వెబ్ సిరీస్ కేటగిరీలో 'అయలి'ని నామినేట్ చేశారు. అలాగే, ఇతర భాషలకు చెందిన మరికొన్ని వెబ్ సిరీస్‌లు కూడా ఈ అవార్డు కోసం పోటీ పడుతున్నాయి.



'అయలి'లో ఓ దృశ్యం



20 శాతం పెరిగిన బంగారం విక్రయాలు

పెరంబూర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): బంగారం ధరలు తగ్గడంతో 20 శాతం మేర విక్రయాలు పెరిగాయి. రాష్ట్రంలో చిన్న, పెద్ద మొత్తం 35,000 నగల దుకాణాలుండగా, ప్రతిరోజూ సుమారు 6,000 కిలోల బంగారం విక్రయాలు జరుగుతుంటాయి. రష్యా-ఉక్రెయిన్ మధ్య నెలకొన్న పోరు, అమెరికా అధ్యక్ష పదవి ఎన్నికల నేపథ్యంలో, ప్రపంచ పెట్టుబడిదారులు గత నెల వరకు బంగారంలో అధిక పెట్టుబడులు పెట్టారు. దీంతో, ప్రపంచవ్యాప్తంగా బంగారం ధరలు పెరిగాయి. రాష్ట్రంలో గత నెల 30వ తేది ఎన్నడూ లేని విధంగా 22 క్యారెట్ల ఆభరణ బంగారం సవర ధర రూ.59,000లకు విక్రయమైంది. అదే సమయంలో ఈ ఏడాది జనవరి 1న ఆభరణ బంగారం రూ.47,820 ఉండగా, 8 నెలల్లో రూ.11,000 మేర ధర పెరిగింది. తాజాగా అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో విజయం సాధించిన డొనాల్డ్ ట్రంప్, పారిశ్రామికాభివృద్ధికి పలు ప్రకటనలు చేశారు. దీంతో, పెట్టుబడిదారులు బంగారంపై పెట్టుబడి తగ్గించి, అమెరికా డాలర్, షేర్ మార్కెట్, క్రిప్టో కరెన్సీ తదితరాల్లో పెట్టుబడులు పెట్టడం ప్రారంభించారు. దీంతో, ప్రపంచవ్యాప్తంగా బంగారం ధరలు తగ్గాయి. ఈ నెల 1వ తేది రూ.59,080గా ఉన్న సవర బంగారం శనివారం రూ.55,480కి తగ్గింది. ఆ ప్రకారం, 15 రోజుల్లో సవరకు రూ.3,600 ధర తగ్గింది. ధరలు తగ్గడంతో రాష్ట్రవ్యాప్తంగా 20 శాతం అదనంగా అంటే 1,200 కిలోల బంగారం విక్రయాలు పెరిగాయని చెన్నై బంగారం, వజ్రాల వ్యాపారుల సంఘం అధ్యక్షులు జయంతిలాల్ తెలిపారు.



కార్తీక దీపోత్సవాలకు ప్రమిదలు సిద్ధం



మట్టితో తయారైన ప్రమిదలు

పెరంబూర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): దిండుగల్ జిల్లా నత్తం, వేడపట్టి, నొచ్చిఓడైపట్టి తదితర ప్రాంతాల్లో ఉన్న కార్మికులు కుండలు, దేవతామూర్తుల విగ్రహాలు, ఇంటి అలంకరణ సామగ్రి, బహుమతి వస్తువులు, ప్రమిదలు తయారుచేసి పొరుగు జిల్లాలు, రాష్ట్రాలకు ఎగుమతి చేస్తుంటారు. ప్రస్తుతం కార్తీక దీపోత్సవాలను పురస్కరించుకొని మట్టి ప్రమిదలు తయారుచేస్తున్నారు. నాగరికత అభివృద్ధితో సిరామిక్, మైనపు దీపాలు మార్కెట్లోకి వస్తున్నా, ప్రజలు ఇంకా మట్టి దీపాలపై ఆసక్తి చూపుతున్నారు. మట్టి దీపాలు సైజుబట్టి రూ.1 నుంచి రూ.5 వరకు విక్రయిస్తున్నారు. పొరుగు జిల్లాలు, రాష్ట్రాల వ్యాపారులు హోల్‌సేల్‌గా ఆర్డర్లు చేసి వీటిని కొనుగోలు చేస్తుంటారు. మట్టి దీపాలే కాకుండా ప్లేట్ ల్యాంప్, కామాక్షి దీపం, మేజిక్ దీపం, హారతి పళ్లెం దీపం ఇలా వివిధ రకాల డిజైన్లలో లభిస్తున్నాయి. సరికొత్త డిజైన్ మట్టి దీపం, పెద్ద మట్టి దీపం, స్వామి విగ్రహంతో కూడిన దీపం, ఐదు ప్రమిదల తామర దీపం తదితరాలు రూ.200 నుంచి రూ.1,000 వరకు విక్రయానికి సిద్ధంగా ఉన్నాయి. ఈ విషయమై తయారీదారుడు గజేంద్రన్ మాట్లాడుతూ... తాము తయారుచేస్తున్న దీపాలు మదురై, తిరుచ్చి, తంజావూరు, కోయంబత్తూర్ సహా పలు జిల్లాలు, కేరళ, ఆంధ్ర ప్రదేశ్, కర్ణాటక తదితర రాష్ట్రాల వ్యాపారులు కొనుగోలు చేసి తీసుకెళ్తుంటారన్నారు. ఈ వృత్తి అంతరించిపోకుండా, దీనిపై ఆధారపడి జీవించే కార్మికులకు ప్రభుత్వాలు ఉపాధి కల్పించాలని గజేంద్రన్ విజ్ఞప్తి చేశారు.



తయారవుతున్న తామర ప్రమిదలు

పళని ఆలయానికి పోటెత్తిన భక్తులు

చెన్నై, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): తమిళుల ఆరాధ్యదైవం మురుగప్పెరుమాన్ కొలువైన ఆరు దివ్యక్షేత్రాల్లో తృతీయ క్షేత్రమైన పళని దండాయుధపాణి పర్వతాలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. శనివారం తమిళ కార్తీకమాసం ప్రారంభం కావటంతో శబరిమలై వెళ్లే భక్తులంతా మాలాధారణ చేశారు. అయ్యప్ప భక్తులు మాల ధరించిన ఒకటి రెండు రోజులకే శబరిమలై వెళ్లి అయ్యప్ప స్వామిని దర్శించుకుని, తిరుగు ప్రయాణంలో పళని, రామేశ్వరం తదితర పుణ్యక్షేత్రాలను సందర్శించిన మీదట స్వస్థలాలకు చేరుకుంటారు. కాగా ఆదివారం రాష్ట్రం నలుమూలల నుండే కాకుండా పుదుచ్చేరి, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక తదితర పొరుగు రాష్ట్రాల నుండి తరలివచ్చిన వేలాదిమంది భక్తులు పళని పర్వతాలయం ప్రాంగణం, పర్వతం కింద చేరుకున్నారు. పళని బస్‌స్టేషన్, పర్వతాలయం దిగువ ప్రాంతం, గిరివీధి తదితర ప్రాంతాల్లో భక్తుల సందడి అధికమైంది. వీరిలో ఎక్కువ మంది అయ్యప్పభక్తులున్నారు. వీరంతా ఉచిత దర్శనం, ప్రత్యేక దర్శనం క్యూలైన్లలో బారులు తీరారు.

పళని పర్వతాలయం వద్ద రద్దీ





మేఘమలై జలపాత హోరు

చెన్నై, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): తేని జిల్లా వరుసనాడు సమీపం పశ్చిమకనుమల్లో ఉన్న మేఘమలై జలపాతం వద్ద ఆదివారం ఉదయం నీటి ఉధృతి పెరగడంతో స్నానం చేయడానికి వెళ్లిన పర్యాటకులందరినీ అధికారులు పంపించేశారు. అనుమతించేంత వరకు జలపాతం వద్ద స్నానం చేయకూడదంటూ నిషేధం విధించారు. మేఘమలై జలపాతాన్ని సందర్శించి, స్నానం చేయడానికి రాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుండి కూడా పర్యాటకులు వస్తుంటారు. శనివారం ఉదయం పశ్చిమకనుమల్లో కుండపోతగా వర్షం కురవటంతో మేఘమలై జలపాతంలో నీటి ఉధృతి తీవ్రరూపం దాల్చింది. ఆదివారం ఉదయం ఆ జలపాతం వద్ద వరదనీరు జోరు ఎక్కువగా ఉండడంతో అధికారులు హుటాహుటిన అక్కడికి వెళ్ళి స్నానం చేసేందుకు అక్కడ ఉన్న పర్యాటకులను పంపించేశారు.

మార్చి నాటికి హైడ్రోజన్ రైలు

పెరంబూర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): తొలి హైడ్రోజన్ రైలు తయారీ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. 2025 మార్చి నాటికి ఈ రైలు అందుబాటులోకి వస్తుందని ఐసీఎఫ్ అధికారులు తెలిపారు. పెరంబూర్ సమీపంలోని ఇంటిగ్రెల్ కోచ్ ఫ్యాక్టరీ (ఐసీఎఫ్)లో 600 డిజైన్లతో కూడిన రైలు బోగీలు తయారుచేస్తున్నారు. మారుతున్న కాలానికనుగుణంగా కొత్త రైలు పథకాలు అమలుచేస్తుండగా, వాటిలో ఐసీఎఫ్ ప్రధాన పాత్ర పోషిస్తోంది. అందులో భాగంగా, పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా, తొలి హైడ్రోజన్ రైలు ఐసీఎఫ్‌లో తయారవుతోంది. ఈ ప్రాజెక్ట్‌కు రైల్వే శాఖ రూ.118 కోట్లు కేటాయించింది. ప్రస్తుతం 50 శాతం పనులు ముగిసిన నేపథ్యంలో, పనులు వేగవంతం చేసి వచ్చే ఏడాది మార్చిలో ఈ రైలు అందుబాటులోకి తీసుకురావాలని రైల్వే శాఖ నిర్ణయించింది. ఈ విషయమై ఐసీఎఫ్ అధికారులు మాట్లాడుతూ... డీజిల్, విద్యుత్ తర్వాత తొలిసారిగా హైడ్రోజన్ రైలు స్వదేశంలోనే తయారు చేస్తున్నామన్నారు. హైడ్రోజన్ ఇంధనంతో ఈ రైలు నడుస్తుందన్నారు. ఈ రైలు కేవలం ఆవిరి మాత్రమే విడుదల చేస్తుందని, అందువల్ల పర్యావరణానికి అనుకూలమైనదని, ప్రారంభ ఉత్పత్తి వ్యయం కొంచెం అధికంగా ఉన్నప్పటికీ, డీజిల్, విద్యుత్ రైళ్ల నిర్వహణ వ్యయంతో పోల్చితే హైడ్రోజన్ రైలు నిర్వహణ వ్యయం తక్కువగా ఉంటుందన్నారు. తొలిదశలో దీనిని స్వల్ప దూరానికే నడుపనున్నామని తెలిపారు. ఒక్కో బోగీలో 84 మంది చొప్పున 10 బోగీలు, టాయిలెట్, సీసీ కెమెరా, ఆటోమేటిక్ డోర్లుంటాయన్నారు. గంటకు 90 కి.మీ వేగంతో పయనించేలా రూపొందించామన్నారు. తొలి రైలు ఏ మార్గంలో నడపాలో రైల్వే శాఖ నిర్ణయిస్తుందని అధికారులు తెలిపారు.



ఐసీఎఫ్‌లో తయారవుతున్న హైడ్రోజన్ రైలు



2025 కిలోల క్రిస్మస్ కేక్ తయారీ

కేక్ తయారీలో సిబ్బంది

పెరంబూర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): క్రిస్మస్ పండుగను ఆహ్వానిస్తూ 2025 కిలోల కేక్ తయారీ ప్రారంభించారు. పొల్లాచ్చి ఉడుమలై సమీపంలోని బేకరీలో దాదాపు 50 మంది కలిసి ఈ కేక్ తయారు చేస్తున్నారు. జీడిపప్పు, ద్రాక్ష, బాదం, పిస్తా, చెర్రీ సహా 15 రకాల పళ్లు, వైన్, పండ్ల రసాలతో ఈ కేక్ తయారుచేస్తున్నారు. క్రిస్మస్ పండుగ రోజున ఈ కేక్ ప్రజలకు విక్రయించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

దేశ జౌళి రంగంలో తమిళనాడు కీలక పాత్ర

● కేంద్ర జౌళి శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్



విద్యార్థులు రూపొందించిన దుస్తులు పరిశీలిస్తున్న కేంద్ర మంత్రి

పెరంబూర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): దేశ జౌళి రంగంలో తమిళనాడు కీలక పాత్ర పోషిస్తుందని కేంద్ర జౌళి శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్ కితాబిచ్చారు. స్థానిక తరమణిలో ఉన్న నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ డిజైనింగ్ సంస్థను ఆదివారం కేంద్ర మంత్రి పరిశీలించారు. విద్యార్థులు చేసిన దుస్తులను తిలకించిన ఆయన వారిని అభినందించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ... ఈ విద్యాసంస్థలో గ్రాడ్యుయేషన్ పూర్తిచేసిన విద్యార్థులు వేలాది ఉద్యోగ అవకాశాలు సృష్టిస్తున్నారన్నారు. ఈ ఇన్‌స్టిట్యూట్ దేశానికే గర్వకారణంగా ఉందన్నారు. టెక్స్‌టైల్, ఫ్యాషన్ డిజైన్‌ను ప్రోత్సహించేలా జౌళి శాఖ ఆధ్వర్యంలో 'విజన్ నెక్స్ట్' అనే కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు. విజన్ నెక్స్ట్ చొరవ, 'మేక్ ఇన్ ఇండియా' ప్రాజెక్ట్ ద్వారా దేశంలోనే దుస్తులు రూపొందించడం, తయారుచేయడం జరుగుతుందన్నారు. ఈ రంగంలో ప్రస్తుతం 4.6 కోట్ల మంది పనిచేస్తుండగా, 2030 నాటికి కార్మికుల సంఖ్య 6 కోట్లకు పెరుగుతుందని తెలిపారు.

విరుదునగర్‌లో టెక్స్‌టైల్ పార్క్

ఎలాంటి వివక్ష లేకుండా రాష్ట్రాలకు నిధులు అందిస్తున్నామని మంత్రి తెలిపారు. విరుదునగర్‌లో టెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటుకు నిధులు కేటాయించామన్నారు.. ఈ పార్క్ పనులు పురోగతిలో ఉన్నాయని కేంద్ర మంత్రి అన్నారు.

చెన్నై తెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో

కార్తీక వన భోజనాలు

చెన్నై, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): చెన్నై తెలుగు అసోసియేషన్ (సీటీఏ) ఆధ్వర్యంలో వన భోజన కార్యక్రమం ఆట పాటలతో కోలాహలంగా జరిగింది. ఈ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతి ఏటా కార్తీక మాసంలో వన భోజనాలు నిర్వహిస్తుంటారు. ఆ ప్రకారం స్థానిక పూందమల్లి సమీపంలోని క్వాలిటీ పార్క్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన వనభోజన కార్యక్రమానికి 340 మందికి పైగా తెలుగు వారు పాల్గొన్నారు. పిల్లలు, మహిళలు, పురుషులు, దంపతులకు వేర్వేరుగా నిర్వహించిన ఆటల పోటీల్లో సభ్యులంతా ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు సీటీఏ అధ్యక్షులు కె.గోపాలకృష్ణారెడ్డి బహుమతులు అందజేశారు. తెలుగు వంటకాలతో మధ్యాహ్న భోజనం, ఉదయం, సాయంత్రం అల్పాహారం అందజేశారు. కార్యక్రమంలో సీటీఏ కార్యదర్శి సురేష్ గాడిపర్తి, ఉపాధ్యక్షులు బి.వెంకయ్య నాయుడు, కోశాధికారి కె.నాగరాజు, సంయుక్త కార్యదర్శి ఎం.రామయ్య, కమిటీ సభ్యులు శ్రీను బాబు, మధుకర్, రామ్‌ప్రసాద్, కొండస్వామి నాయుడు, మాజీ కల్చరల్ సెక్రటరీ శ్రీకాంత్, మాజీ కార్యదర్శి పీవీ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



లెమన్ స్పూన్ పోటీల్లో మహిళలు



విజేతలకు బహుమతులందజేస్తున్న సీటీఏ అధ్యక్షులు కె.గోపాలకృష్ణారెడ్డి తదితరులు



సాహితీ సదస్సు ముగింపు కార్యక్రమంలో గవర్నర్ ఆర్ఎన్ రవితో విద్యావేత్తలు

ముగిసిన అంతర్జాతీయ సాహితీ సదస్సు

● ప్రశంసా పత్రాల పంపిణీ

అడయార్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక గిండీలోని రాజ్‌భవన్‌లో 'తిరువళ్లువర్, వేమన, కబీర్ దాస్' సారూప్యతపై జరిగిన అంతర్జాతీయ సాహితీ సదస్సు ఆదివారంతో ముగిసింది. శనివారం ప్రారంభమైన ఈ సదస్సును గవర్నర్ ఆర్.ఎన్.రవి ప్రారంభించారు. పాలక్కాడ్‌లోని టీసీఆర్‌సీ, చెన్నై హిందీ ప్రచారక్ సంఘ్, డీఏవీ కాలేజ్ (అజ్మీర్), సేలంకు చెందిన శోక ఎఫ్ఎం సహకారంతో ఈ సదస్సు జరిగింది. సుమారు 200 మంది వరకు విద్యావేత్తలు పాల్గొన్నారు. తిరువళ్లువర్, వేమన, కబీర్ దాస్‌ల మధ్య ఉండే సారూప్యతలను ఎన్నో ఉదహరిస్తూ అద్భుతమైన ప్రసంగాలతో వారు ఆకట్టుకున్నారు. ఈ సభలో డాక్టర్ ఏవీ శివకుమారి కబీర్ దాస్, యోగి వేమన మధ్య ఉన్న సారూప్యతలను వివరించారు. ముగింపు సభలో ఇందులో పాల్గొన్న వారందరికీ ప్రశంసా పత్రాలు అందించారు.

చెన్నై, వేలప్పన్‌చావడిలో ఆదివారం జరిగిన ఎంజీఆర్ యూనివర్సిటీ 33వ స్నాతకోత్సవంలో నటుడు అర్జున్‌కు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేస్తున్న కేంద్ర సహాయ మంత్రి ఎల్.మురుగన్, వర్సిటీ చాన్సలర్ ఏసీ షణ్ముగం. ఈ స్నాతకోత్సవంలోనే సినీ దర్శకుడు పి.వాసుకు కూడా గౌరవ డాక్టరేట్ ప్రదానం చేశారు.



